25 కి.మీ. నడిచి... సమస్యలు వివరించి


విద్యార్థినులతో మాట్లాడుతున్న డీఈఓ సుశాంత

రాయగడ పట్టణం, న్యూస్‌టుడే: పాలనాధికారి దృష్టికి తమ సమస్యలను తీసుకెళ్లేందుకు వందమంది విద్యార్థినులు 25 కి.మీ. నడిచి వెళ్లిన ఘటన మంగళవారం కలహండి జిల్లాలో చోటుచేసుకుంది. టి.రాంపూర్ సమితి కియాపొదర్‌లో ఉన్న కస్తూర్బా రెసిడెన్షియల్ పాఠశాలలో నాణ్యమైన ఆహారం పెట్టడం లేదని, అపారిశుద్ధ్యం తదితర సమస్యలు వేధిస్తున్నాయని విద్యార్థినులు ఆరోపించారు. సమస్యలను పాలనాధికారికి వివరించేందుకు 25 కి.మీ. కాలినడకన భవానీపట్నానికి వందమంది విద్యార్థినులు బయలుదేరారు. విషయం తెలుసుకున్న జిల్లా విద్యాశాఖ అధికారి(డీఈఓ) సుశాంత చౌప్దార్ మార్గమధ్యలో వారిని కలిసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యలు పరిష్కరిస్తానని డీఈఓ చెప్పినా వారు ససేమిరా అన్నారు. కలెక్టర్‌ను ఎలాగైనా కలవాల్సిందేనని మొండికేయడంతో తప్పనిసరి పరిస్థితుల్లో సుశాంత వారికోసం బస్సు ఏర్పాటు చేశారు. అనంతరం తనను కలిసిన విద్యార్థులతో కలెక్టర్ సచిన్‌పవార్ మాట్లాడుతూ త్వరలోనే పాఠశాలను సందర్శించి సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సరితాదాస్ మాట్లాడుతూ ముందురోజు రాత్రి వార్డెన్ తపస్వినీనాయక్ విద్యార్థినులను రెచ్చగొట్టారని ఆరోపించారు. ఈ నేపథ్యంలో వార్డెన్ మంగళవారం రాజీనామా చేసి ఆదర్శ విద్యాలయంలో చేరడం గమనార్హం.

ధరల భారం.. విద్యార్థులకు శాపం

★ భారంగా మారుతున్న మధ్యాహ్న భోజన పథకం
★ రూ.10-15 పెంచాలని డిమాండ్


బెంబేలెత్తిస్తున్న కూరగాయల ధరలు

రాయగడ పట్టణం, న్యూస్‌టుడే

రాష్ట్రంలో ప్రాథమిక, ఎగువ ప్రాథమిక పాఠశాలల్లో అమలు చేస్తున్న మధ్యాహ్నభోజన పథకం రోజురోజుకు ప్రశ్నార్థకంగా మారుతోంది. పెరుగుతున్న నిత్యావసర సరకుల ధరలతో దీని నిర్వహణ భారమవుతోంది. విద్యార్థులకు పోషకాలు మాట అటుంచితే వారి పొట్ట నిండే మార్గం కరవవుతోంది. ఇటీవల ఆగస్టు నెలలో మధ్యాహ్న భోజన పథకం కోసం ఒక రూపాయి పెంచుతున్నట్లు ముఖ్యమంత్రి మోహన్‌మాఝి ప్రకటించిన విషయం తెలిసిందే. ప్రస్తుత ధరలకు ఇది ఏమాత్రం సరిపోదని ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు వాపోతున్నారు. మరోవైపు ఈ పెంపునకు సంబంధించి ఇంతవరకు ఎలాంటి నోటిఫికేషన్ చేరలేదని అఖిల ఉత్కళ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు, సమాఖ్య సభ్యులు చెబుతున్నారు. దీనిపై ప్రభుత్వం పునరాలోచన చేసుకొని రూ.10 నుంచి రూ.15 వరకు పెంచాలని వీరు డిమాండ్ చేస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్లో చాలావరకు కూరగాయల ధరలు కిలో రూ.60, అంతకంటే ఎక్కువ పలుకుతుండగా, మరికొన్ని రకాలు ఏకంగా కిలో రూ.80 పైబడి ఉన్నాయంటున్నారు. వారానికి రెండుసార్లు విద్యార్థులకు అందించే కోడిగుడ్ల ధరలు సైతం కొండెక్కి కూర్చున్నట్లు పేర్కొంటున్నారు. భోజన ఖర్చును రూ.15 నుంచి రూ.25 వరకు పెంచాలని కోరుతూ గతంలో సర్కారుకు విన్నవించగా కేవలం రూపాయి మాత్రమే పెంచిందని గుర్తుచేశారు.


మధ్యాహ్న భోజనం చేస్తున్న విద్యార్థులు

45 లక్షల మందిపై ప్రభావం

రాష్ట్రంలో 50,485 ప్రాథమిక, ఎగువ ప్రాథమిక పాఠశాలల్లో 45 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నట్లు గణాంకాలు పేర్కొంటున్నాయి. ధరల పెరుగుదలతో వీరందరి పౌష్టికాహారంపై ప్రభావం చూపుతోందన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. పీఎం-పోషణ్ కింద విద్యార్థులకు సోమ, గురువారాల్లో అన్నం, దాల్మా అందిస్తుండగా, మంగళ, శుక్రవారాల్లో సోయాబీన్స్ కూర, బుధ, శనివారాల్లో కోడిగుడ్లు అందిస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా ప్రాథమిక విద్యార్థుల (ఒకటి నుంచి ఐదో తరగతి)కు 25 గ్రాముల చొప్పున పప్పు, 12 గ్రాముల బీన్స్, ఆరు నుంచి ఎనిమిదో తరగతి విద్యార్థులకు వీటిని 30 గ్రా, 25 గ్రాముల చొప్పున అందించాల్సి ఉంది. ఇందుకోసం ఒక్కో విద్యార్థికి రూ.5.90, ఎగువ ప్రాథమిక విద్యార్థులకు 8.82 చొప్పున (తాజా పెంపు మినహా) సర్కార్ వెచ్చిస్తోంది. మధ్యాహ్న భోజన పథకం నాణ్యంగా అందించాలంటే మొత్తాలు పెంచాలన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఎరువుల కొరత... అన్నదాత కలత


వరి చేసుకి ఎరువులు చల్లుతున్న రైతు

గజపతి జిల్లాలో రైతులను వెంటాడుతున్న నల్లబజారుల బెడద

రాయగడ పట్టణం, పర్లాఖెముండి, న్యూస్‌టుడే

ఆరుగాలం శ్రమించే అన్నదాతకు ఎరువుల కృత్రిమ కొరత శాపంగా మారుతోంది. ప్రకృతి విపత్తుల భయంతో బిక్కుబిక్కుమంటూ ఖరీఫ్ సాగు చేసే కర్షకులకు నల్లబజారు బెడద గుబులు రేపుతోంది. గజపతి జిల్లాలో ఎదురవుతున్న ఈ సమస్యతో ఎంతోమంది రైతులు దిగులు చెందుతున్నారు. జిల్లాలో కొంతమంది వ్యాపారులు కృత్రిమ ఎరువుల కొరత సృష్టించి, నల్లబజారుకు తెరలేపుతూ అన్నదాతలను నిలువునా దోచుకుంటున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. జిల్లా యంత్రాంగం, వ్యవసాయ శాఖ అధికారుల నిర్లక్ష్యంతోనే ఈ పరిస్థితి ఏర్పడుతున్నట్లు రైతులు ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో రాయితీ కేటగిరిలో ఎరువులు దొరక్క, నల్లబజారులో అధిక ధరలకు కొనుగోలు చేయాల్సి వస్తోందని వాపోతున్నారు. దీంతో సాగు పెట్టుబడి ఖర్చులు పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై జిల్లా కృషక్ మోర్చా అధ్యక్షుడు సూర్యనారాయణ పట్నాయక్ 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ... ఎరువులు, విత్తనాల కృత్రిమ కొరత అంశంపై పలుమార్లు జిల్లా యంత్రాంగం, వ్యవసాయ అధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు. అయినప్పటికీ ఎలాంటి ప్రయోజనం లేకపోవడంతో రైతులు బయట మార్కెట్లో వీటిని కొనుగోలు చేస్తూ తీవ్రంగా నష్టపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ సమస్యకు పరిష్కారం చూపాలని కోరుతున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ఇదీ పరిస్థితి

అసలు ధర కంటే పెంచి ఎరువులు అమ్ముతుండడం అన్నదాతలకు శాపంగా మారుతోందన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. ఉదాహరణకు 50 కిలోల యూరియా బస్తా రూ.266.50కి విక్రయించాల్సి ఉండగా రూ.450,-రూ.500 మధ్య అమ్ముతున్నట్లు రైతులు ఆరోపిస్తున్నారు. పొటాష్ ప్యాకెట్ ధర రూ.1,550 నిర్ణయించగా, రూ.1,750కి విక్రయిస్తుండటం గమనార్హం. జిల్లా కేంద్రమైన పర్లాఖెముండి పట్టణంతో పాటు వివిధ సమితుల్లోనూ ఇదే పంథా కొనసాగుతోందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై జిల్లా వ్యవసాయశాఖ కార్యాలయంలో చాలాసార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ ఎలాంటి ఫలితాలు కానరాలేదని అన్నదాతలు ఆరోపిస్తున్నారు. దీనిపై జిల్లా వ్యవసాయశాఖ అధికారి బలరాం సుబుద్ధి స్పందిస్తూ.... జిల్లా కేంద్రంతోపాటు సమితి పరిధిలోని ఎరువుల కేంద్రాల్లో విస్తృతంగా తనిఖీలు చేపట్టాలని ఇటీవల అధికారులకు దిశానిర్దేశం చేసినట్లు చెప్పారు. నల్లబజారులో విక్రయాలకు పాల్పడుతున్నట్లు గుర్తిస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

కొంధమాల్‌లో అతిసారం: అయిదుగురి మృతి

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: కొంధమాల్ జిల్లా కోటగడ సమితిలో దుర్గాపంగ పంచాయతీలోని కుబిలాయి పరిసర గ్రామాల్లో ఇటీవల అతిసారం ప్రబలి అయిదుగురు మృతిచెందారు. మరో 35 మందికిపైగా చికిత్సలు పొందుతున్నట్లు బుధవారం వార్తలు వచ్చాయి. కుబిలాయి గ్రామంలో పది రోజుల కిందట జరిగిన విందులో భోజనాలు తిన్న పలువురు అతిసారం బారిన పడగా, తర్వాత ఇది సమీపంలోని దలిరి, సకరి, సింధిబాయి తదితర గ్రామాలకు వ్యాపించింది. దీంతో బాధితులను కోటగడ, బలిగుడ ఆసుపత్రులలో చేర్పించి చికిత్సలు అందించారు. జిల్లా ముఖ్య వైద్యం, ప్రజారోగ్య అధికారి (సీడీఎం, పీహెచ్‌ఓ) కార్యాలయం పరిధిలోని ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్, ఇతర బృందాలు ఆయా గ్రామాల్లో పర్యటించి, అతిసారానికి గల కారణాలపై ఆరా తీశారు. ప్రస్తుతానికి పరిస్థితి నియంత్రణలో ఉండగా, గట్టి నిఘా పెట్టామని వైద్యాధికారులు బుధవారం విలేకరులకు తెలిపారు.


నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు


పృథ్వీరాజ్ హరిచందన్

గోపాలపూర్, న్యూస్‌టుడే: పూరీ శ్రీక్షేత్రంలో నిబంధనలు ఉల్లంఘించేవారిని ఉపేక్షించబోమని, కఠిన చర్యలు తీసుకుంటామని న్యాయశాఖ మంత్రి పృథ్వీరాజ్ హరిచందన్ చెప్పారు. బుధవారం పూరీలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ... 'సేవాయత్‌ల నియంతృత్వ పోకడలకు చెల్లుచీటీ రాశాం' అన్నారు. ఇనుపపాత్రలో స్వామికి ఒబడా వండిన ఘటన తీవ్రమైనదని, దీనిపై గట్టి చర్యలు తీసుకోవాలని శ్రీక్షేత్ర యంత్రాంగాన్ని ఆదేశించామన్నారు. కోట్లమంది భక్తుల మనోభావాలు, భక్తిప్రపత్తులతో కూడిన పురుషోత్తముని సేవలన్నీ నిర్ణీత వేళల్లో నిబంధనల ప్రకారం జరుగుతాయని, సమయ పాలన, నియమాల అమలులో కఠినంగా ఉండాలన్నారు. శ్రీక్షేత్ర సేవలతో ప్రమేయం ఉన్న సేవాయత్‌లు, సిబ్బంది జవాబుదారీగా ఉండాలని హెచ్చరిస్తున్నట్లు హరిచందన్ చెప్పారు.

మహాత్మునికి నివాళులు

భువనేశ్వర్, న్యూస్‌టుడే: గాంధీ జయంతిని పురస్కరించుకుని శాసనసభ ఆవరణలో బుధవారం మహాత్ముని విగ్రహం వద్ద నివాళి అర్పించారు. గవర్నరు రఘుబర్‌దాస్, సభాపతి సురమా పాడి, ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝి, ఉపసభాపతి భవానీ శంకర్ భోయ్ తదితర ప్రముఖులు పాల్గొన్నారు. మహాత్ముని విగ్రహం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి అంజలి ఘటించారు. సద్భావన ప్రార్థనలు జరిగాయి. గాంధీ ఆదర్శాలను గుర్తు చేసుకొని సేవలను ప్రస్తుతించారు.


మహాత్ముని విగ్రహం వద్ద గవర్నరు, సభాపతి, ముఖ్యమంత్రి, ఉప సభాపతి తదితరులు

సుప్రసిద్ధ మా కాళువా యాత్ర ప్రారంభం

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: గుసానినువాగాంలోని సుప్రసిద్ధ 'మా కాళువా యాత్ర' బుధవారం రాత్రి కోలాహలంగా ప్రారంభమైంది. యాత్ర సందర్భంగా గుసానినువాగాం పెద్దవీధిలోని తాత్కాలిక మందిరాన్ని దివ్యంగా అలంకరించారు. విద్యుద్దీపాలు, గుడ్డ పెండాలు ఏర్పాటు చేశారు. శివాలయంలోని మా కాళువా తల్లి నిజ మందిరాన్ని పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. యాత్ర నేపథ్యంలో గుసానినువాగాంలోని వీధుల్లో పండగ కళ మొదలైంది. కుమార పౌర్ణమి వరకు ఈ యాత్ర కొనసాగుతుందని నిర్వాహక కమిటీ ప్రతినిధులు తెలిపారు.


గుసానినువాగాంలోని నిజ మందిరంలో మా కాళువా తల్లి

ప్రతాప్ జెనాకు ఊరట

భువనేశ్వర్, న్యూస్‌టుడే: న్యాయశాఖ మాజీ మంత్రి ప్రతాప్ జెనాకు రాష్ట్ర ఉన్నత న్యాయస్థానంలో ఊరట లభించింది. 2021 జనవరి 21న కటక్ జిల్లా సాలేపూర్‌లో బాబాజీ నేతలు కులమణి, దివ్యసింగ్ బౌరిల హత్య జరిగింది. 13 మంది నిందితుల్లో ప్రతాప్ జెనా పేరు కూడా ఉంది. ఈ కేసు విచారించిన సాలేపూర్ జేఎంఎఫ్‌సీ న్యాయస్థానం గతంలో 9 మందికి యావజ్జీవ కారాగార శిక్ష విధించింది. మరికొందరిపై నేరారోపణలు రుజువు చేసే సాక్ష్యాధారాలు లేవని విడుదల చేసింది. మరో ఇద్దరిపై విచారణ సాగుతోంది. ప్రతాప్‌పై విచారణ పూర్తి కాలేదు. ఈ క్రమంలో ఆయన రాష్ట్ర ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. రాజకీయ దురుద్దేశంతో తనను కేసులో ఇరికించారని, మరణాలతో తనకు సంబంధం లేదని న్యాయస్థానానికి తెలిపారు. మంగళవారం విచారించిన న్యాయస్థానం ఆయనను నిరపరాధిగా ప్రకటించింది.

పోషించలేక బిడ్డను అమ్ముకున్న తండ్రి

భువనేశ్వర్, న్యూస్‌టుడే: గతంలో కరవు కాటకాలకు నిలయంగా నిలిచిన కలహండి జిల్లాలో తిండికి లేక తల్లిదండ్రులు తమ బిడ్డల్ని విక్రయించిన వైనం అప్పట్లో దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. పరిస్థితి సమీక్షించడానికి స్వయంగా నాటి ప్రధాని రాజీవ్‌గాంధీ కలహండి వచ్చారు. తరువాత వచ్చిన ప్రధాని పి.వి.నరసింహారావు కేబీకే పథకం ప్రారంభించిన సంగతి తెలిసిందే. మళ్లీ 2019లో జాజ్‌పూర్ జిల్లా నగాడాలో పేదరికం, పౌష్టికాహారలోపంతో 15 మంది పిల్లలు మృతి చెందిన ఘటన నాటి నవీన్ ప్రభుత్వ ప్రతిష్ఠను మసకబార్చింది. తరచూ ఇలాంటి ఘటనలు జరుగుతునే ఉన్నాయి. ఇప్పుడు జాజ్‌పూర్ జిల్లా కొరై సమితిలోని నువాపట్నా గ్రామంలో గురుబారి నాయక్ అనే వ్యక్తి ఒకటిన్నర నెలల వయసున్న కన్నబిడ్డను పెంచలేక రూ.7 వేలకు అమ్ముకున్నాడు. నవమాసాలు మోసిన కన్నతల్లి తట్టుకోలేకపోయింది. కొరై పోలీసులను ఆశ్రయించింది. ఇటీవల ఈ ఘటన జరగ్గా.... పోలీసులు దర్యాప్తు చేసి ఈ మగబిడ్డను శిశు సంరక్షణ శాఖకు అప్పగించారు. తాను కూలి పనులు చేసి బిడ్డను పెంచుతానని, ఆయనను తనకు అప్పగించాలని తల్లి శకుంతల పోలీసులు, శిశు సంరక్షణ అధికారులను వేడుకుంటోంది. ఈ విషయమై అధికారులు ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు.

మహాత్మాగాంధీ విగ్రహానికి నిత్య పూజలు


పూజలందుకుంటున్న మహాత్మాగాంధీ విగ్రహం

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: బ్రహ్మపురలోని గుసానినువాగాం జగన్నాథ స్వామి మందిరం ఆవరణలో మహాత్మాగాంధీ విగ్రహం నిత్యం పూజలందుకుంటోంది. మందిరం ఆవరణలో జగన్నాథ, బలభద్ర, సుభద్రలతోపాటు రాధాకృష్ణులు, హనుమాన్, మహాలక్ష్మి తదితర ఆలయాలున్నాయి. వీటిలో భాగవత గద్దె పేరిట ఆలయంలో దేవుళ్లతోపాటు మహాత్మాగాంధీ విగ్రహాన్ని 1960లో తమ పూర్వీకులు ఏర్పాటు చేశారని మందిరం నిర్వాహకుడు పంచానన చౌధురి బుధవారం 'న్యూస్‌టుడే'కు చెప్పారు. అప్పటి నుంచి ప్రతిరోజు ఆలయ సమూహంలోని దేవతామూర్తులతోపాటు మహాత్మాగాంధీ విగ్రహానికి కూడా పూజలు జరుగుతున్నాయని ఆయన పేర్కొన్నారు. బుధవారం గాంధీ జయంత్యుత్సవం సందర్భంగా భక్తులు ఆయన విగ్రహానికి పూజలు చేశారు.

సామూహిక పిండ ప్రదానాలు



మహాలయ అమావాస్య సందర్భంగా బుధవారం పితృ దేవతలకు ప్రజలు పిండ ప్రదానాలు చేశారు. బ్రహ్మపురలో గుసానినువాగాంలోని జగన్నాథ మందిరం ఆవరణలో నిర్వహించిన సామూహిక పిండ ప్రదానాల్లో వందలాది మంది పాల్గొన్నారు.
–న్యూస్‌టుడే, బ్రహ్మపుర నగరం

మహిళపై సామూహిక అత్యాచారం

భువనేశ్వర్, న్యూస్‌టుడే: భువనేశ్వర్‌లోని మైత్రీ విహార్ పరిధిలోని ఒక బహుళ అంతస్థుల భవనంలో మహిళపై సామూహిక అత్యాచారం జరిగినట్లు బుధవారం పోలీసులు తెలిపారు. సోమవారం ఈ ఘటన జరిగింది. ఒక ప్రైవేటు కంపెనీలో పనిచేస్తున్న మహిళ 10 రోజుల క్రితం మైత్రీ విహార్‌లోని ఈ భవనంలో అద్దెకు దిగింది. ఈ నేపథ్యంలో 30వ తేదీ అర్ధరాత్రి 2 గంటలకు ఆమె నివాసంలోకి ప్రవేశించిన దుండగులు మారణాయుధాలతో బెదిరించి సామూహిక అత్యాచారం చేసి ఇంటిలోని ఆభరణాలు, సామగ్రి దోచుకుని పరారయ్యారు. బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో దర్యాప్తు ప్రారంభించారు. సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా ముగ్గుర్ని అరెస్ట్ చేసినట్లు పోలీస్ కమిషనర్ సురేష్ దేవదత్త సింగ్ విలేకరులకు చెప్పారు. బాధితురాలికి రెండేళ్ల పాప ఉంది.

మహాలయ వేడుకలు ప్రారంభం


జయజయ జయహే మహిషాసుర మర్దని


కటక్ చండీ


సంబల్‌పూర్ శామలాయి


జాజ్‌పూర్ బిరజాదేవి


కాకట్‌పూర్ మంగళాదేవి

శక్తి పీఠాల్లో నవరాత్రుల పూజలకు అంకురార్పణ

దేవీ పెండాళ్లకు చిత్రకారుల తుది మెరుగులు

గోపాలపూర్, న్యూస్‌టుడే: భువి నుంచి దివికి అమ్మ దిగొచ్చింది. మహాలయ అమావాస్యను పురస్కరించుకుని శక్తిపీఠాల్లో నవరాత్రుల ఉత్సవాలు బుధవారం నుంచి ప్రారంభమయ్యాయి. దుష్ట శిక్షణ, శిష్ట జన రక్షణ ఈ వేడుకల పరమార్థం. ఉత్కళవాసులు శైవ, వైష్ణవ, శాక్తేయ ఆచారాలు, పూజలు సమానంగా ఆచరిస్తారు.

పౌర్ణమి నుంచే ఆరాధన..: రాష్ట్రంలో ఆనవాయితీ ప్రకారం ఆశ్వీయుజ పౌర్ణమి (సెప్టెంబరు 18) నుంచి దేవీ ఆరాధనలు ప్రారంభమయ్యాయి. శక్తి పీఠాల్లో తల్లులకు షోడశోపచార పూజలు నిర్వహిస్తున్నారు. దివంగతులకు పిండ ప్రదానాలు చేస్తారు. మహాలయ అమావాస్యను పురస్కరించుకొని బుధవారం సామూహిక సంతర్పణలు జరిగాయి. బుధవారం ఉప ముఖ్యమంత్రి ప్రభాతి పరిడ కాకట్‌పూర్‌లోని మంగళాదేవికి పూజలు నిర్వహించారు.

నవమి వరకు పూజలు...: కటక్ చండీ, సంబల్‌పూర్ శామలాయి, పూరీ (కాకట్‌పూర్) మంగళా, బాణపూర్ (ఖుర్దా) భగవతి, జాజ్‌పూర్ బిరజా, భవానీపట్నా మాణికేశ్వరి, ఘటగాం తారిణి, పురుషోత్తంపూర్ తరాతరిణి, మంత్రిడి సిద్ధభైరవి ప్రముఖ శక్తి పీఠాలు. పూరీ శ్రీక్షేత్రంలోని విమలా అమ్మవారు ప్రత్యేకమైనది. దేవీ నవరాత్రుల్లో శక్తి పూజలు చేస్తే శుభాలు చేకూరతాయన్న నమ్మకం అందరిలో ఉంది. శక్తి పీఠాల్లో అమావాస్య నుంచి మహానవమి వరకు గోప్య సేవలూ జరుగుతాయి.


మంగళాదేవి సన్నిధిలో బుధవారం పూజలు చేస్తున్న ఉపముఖ్యమంత్రి ప్రభాతి పరిడ

విశ్వశాంతి ధ్యేయంగా...: విశ్వశాంతి ధ్యేయంగా చండీ, శామలాయి, మంగళాదేవి, విమలాదేవి పీఠాల్లో అమావాస్య నుంచి హోమాలు ప్రారంభించారు. మరోవైపు గ్రామాల్లోని అమ్మవార్ల ఆలయాల్లో ప్రజలు శాంతిపూజలు చేయిస్తున్నారు. దుష్టశక్తుల నుంచి కాపాడాలని, విపత్తులు రాకుండా చూడాలని ప్రార్థిస్తున్నారు.

బొమ్మలకు తుది మెరుగులు.. : నగరాలు, పట్టణాల్లో దేవీ నవరాత్రుల పూజల కోసం నిలువెత్తు మహిషాసుర మర్దనీ విగ్రహాలు రూపుదిద్దుకున్నాయి. గురువారం ఆశ్వీయుజ శుక్లపక్షమి పాడ్యమి తిథి శుభలగ్నంలో పెండాళ్లలో పూజలు ప్రారంభం కానున్నాయి. మరికొన్నిచోట్ల సప్తమి నుంచి వేడుకలు చేపడతారు. ఈ నేపథ్యంలో చెయ్యి తిరిగిన శిల్పులు అమ్మవార్ల విగ్రహాలకు తుది మెరుగులు దిద్దుతున్నారు. దశమి (అక్టోబరు 12) వరకు రాష్ట్రవ్యాప్తంగా దసరా సంబరాలు కొనసాగుతాయి.. పంటలు బాగున్నందున అన్నదాతల్లో ఉత్సాహం వెల్లివిరుస్తోంది.

బస్సు, లారీ ఢీ: 24 మందికి గాయాలు


బస్సులోకి దూసుకు వెళ్లిన నీలగిరి కర్రలు


లక్ష్మీ బస్సులో గాయపడిన ప్రయాణికులు


ఆరోగ్య కేంద్రానికి క్షతగాత్రుల తరలింపు

సిమిలిగుడ, న్యూస్‌టుడే: కొరాపుట్ జిల్లా లక్ష్మీపూర్ ప్రాంతంలో బస్సు లారీ ఢీకొన్న ప్రమాదంలో 22 మంది గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాయగడ నుంచి జయపురానికి వెళ్తున్న ఎంఎస్‌ఎస్‌బీ ప్రైవేట్ బస్సు, కొరాపుట్ నుంచి జేకేపూర్‌కు నీలగిరి కలపతో వస్తున్న లారీ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటన లక్ష్మీపూర్-తోయాపుట్ మార్గంలో దుమ్మిరి పొదరో కూడలి వద్ద 326 జాతీయ రహదారిపై జరిగింది. బస్సులో ప్రయాణిస్తున్న 60 మంది ప్రయాణికుల్లో 22 మందికి గాయాలయ్యాయి. వాహనాదారులు గాయపడినవారిని బయటకు తీశారు. పోలీసులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న లక్ష్మీపూర్ ఎమ్మెల్యే పవిత్ర శాంత, బిజద జిల్లా అధ్యక్షుడు జిను హికాకా సంఘటన స్థలానికి చేరుకున్నారు.. అటుగా వెళ్తున్న లక్ష్మీ బస్సులో వీరిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బస్సు, లారీ చోదకులు వాహనాల మధ్య ఇరుక్కుపోవడంతో అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు గంటసేపు శ్రమించి సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రుల్లో ఆరుగురి పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో కొరాపుట్‌లో లక్ష్మణ్ నాయక్ వైద్య కళాశాలలో చేర్చారు. నీలగిరి కర్రలు బస్సులోకి దూసుకుపోవడంతో ప్రయాణికులు గాయపడ్డారు. అందులో కొంతమంది విద్యార్థులు, ప్రభుత్వ ఉద్యోగులు, రోజువారి కూలీలు ఉన్నారు. గాయపడిన వారి వివరాలు తెలియాల్సి ఉంది.

ఆత్మస్థైర్యంతో లక్ష్యం దిశగా అడుగులు

గుణుపురం, న్యూస్‌టుడే: ఏదైనా సాధించాలన్న లక్ష్యం.. బాగా చదువుకుని దేశ సేవ చేయాలన్న దృఢ సంకల్పంతో ముందుకు వెళ్తోంది అర్చన. తండ్రి అనారోగ్యం బారిన పడడంతో తల్లి సమీప ఇళ్లలో వంట పనులు చేస్తుంది. ఆర్థిక పరిస్థితి బాగులేకపోవడంతో కొరియర్‌లో పని చేస్తూ, ఇద్దరు చెల్లెలు, తమ్ముడి ఆలనాపాలనా చూస్తోంది. ప్రస్తుతం ఆమె డిప్లొమా చదువుతోంది. వివరాల్లోకి వెళ్తే గుణుపురం పురపాలక సంస్థ కొత్త్యాలు గుడలోని కొయిబొర్తోలో అర్చనా కుటుంబం నివశిస్తోంది. తండ్రి అనారోగ్యం కారణంగా అర్చనా తాను పని చేస్తూ ఇద్దరు చెల్లెలు, తమ్ముడును చదివిస్తోంది. ఉదయం కళాశాలకు వెళ్లి మధ్యాహ్నం కొరియర్‌లో విధులు నిర్వహిస్తోంది. రాత్రి ఇంటికి వచ్చి తల్లికి సాయం చేస్తుంది. బాగా చదువుకుని త్రివిధ దళాల్లో చేరాలని లక్ష్యంతో కష్టపడుతోంది. అర్చన ఆత్మస్థైర్యాన్ని చూసి పలువురు ప్రశంసిస్తున్నారు. ప్రభుత్వం సహాయం చేస్తే ఆమె కన్న కలలు నెరవేరుతాయని స్థానికులు అంటున్నారు.


కొరియర్ అందిస్తున్న అర్చనా కొయిబొర్తో

అనాథాశ్రమంలో స్వచ్ఛ భారత్ కార్యక్రమం

గుణుపురం, న్యూస్‌టుడే: రాయగడజిల్లా గుణుపురం పట్టణం సేవాసమాజ్ బాలికల అనాథాశ్రమంలో బుధవారం స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. ఆవరణంలో పరిసరాలను శుభ్రం చేశారు. ఆశ్రమానికి సమీపంలో ఉన్న ప్రధాన రహదారిపై వ్యర్థాలను తొలగించి, గోతులు పూడ్చారు. అనంతరం ర్యాలీ చేపట్టారు. ఆశ్రమం నిర్వాహకురాలు రాజేశ్వరీ దొళాయి తదితరులు పాల్గొన్నారు.


ప్రధాన రహదారిలో శుభ్రం చేస్తున్న బాలికలు

సమస్య తీరేనా ?

జయపురం, న్యూస్‌టుడే: నదిలో బట్టలు ఉతుకుతుండగా ఓ మహిళ కాలు జారి పడి గాయపడిన ఘటన కొరాపుట జిల్లాలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే కొరాపుట్ జిల్లా దశమంత్‌పూర్ సమితి డంగసిల పంచాయతీ సిషపాస గ్రామానికి చెందిన జయమాఝి భార్య తిలాయిమాఝి బట్టలు ఉతకడానికి నదికి వెళ్లింది. ప్రమాదవశాత్తు కాలు జారి పడిపోగా స్థానికులు రక్షించారు. ఈ ఘటనలో ఆమె గాయపడింది. అంబులెన్స్ వచ్చేందుకు రహదారి సౌకర్యం లేకపోవడంతో గ్రామస్థులు మంచంపై నదిలో నాలుగు కిలోమీటర్లు అంబాగావ్ వరకు మోసుకెళ్లారు. అక్కడ నుంచి ఆటోలో ఆసుపత్రికి తరలించారు. వంతెనతో పాటు రోడ్డు నిర్మించాలని పలుమార్లు అధికారులు కోరినా ఫలితం లేదని వాపోయారు.


నదిలో మహిళను మోసుకెళ్తున్న గ్రామస్థులు

శిశు సంరక్షణ కేంద్రంలో బాలుడు

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: బాల కార్మిక వ్యవస్థ నిర్మూలించేందుకు జిల్లా యంత్రాంగం సోదాలు చేస్తుంది. ఈ నేపథ్యంలో పర్లాఖెముండి పట్టణంలోని కొత్త బస్టాండ్ పరిసరా ప్రాంతంలో ప్లాస్టిక్ వస్తువులు, పాలీథిన్ సంచులు సేకరిస్తు 10 ఏళ్ల బాలుడు కనిపించాడు. ఆ బాలుడ్ని జిల్లా యంత్రాంగం శిశు సంరక్షణ కేంద్రానికి తరలించారు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు కేంద్రం వద్దకు వెళ్లి చదివించేందుకు స్తోమత లేదని అధికారులకు విన్నవించారు. దీంతో యంత్రాంగం బాలుడిని ఉన్నత విద్యలు చదివిస్తూ, అన్ని రకాల సదుపాయాలు కల్పిస్తామని తల్లిదండ్రులను ఒప్పించారు. ఈ విషయాన్ని జిల్లా శిశు సంరక్షణ అధికారి అరుణ్ కుమార్ త్రిపాఠి ఓ ప్రకటనలో తెలిపారు .

నమ్మించి మోసగించిన భాజపా పెద్దలు

● జనసంపర్కయాత్రలో దుయ్యబట్టిన నవీన్

భువనేశ్వర్, న్యూస్‌టుడే: ఎన్నికల్లో భాజపా గెలిచినా ప్రజలు హృదయాలు గెలవలేదని, ఆ పార్టీ పెద్దలు ప్రజలను నమ్మించి మోసగించారని విపక్షనేత నవీన్ పట్నాయక్ దుయ్యబట్టారు. బుధవారం నుంచి బిజద జనసంపర్క యాత్రలు రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభమయ్యాయి. భువనేశ్వర్ కార్యక్రమంలో పాల్గొన్న పార్టీ అధినేత నేతాజీ పార్కు ఆవరణలో మాట్లాడారు. అధికారానికి వచ్చిన 100 రోజుల్లో వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు రూ.3 వేల పింఛను, 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు, సుభద్ర కార్యక్రమం కింది ఒకేసారి మహిళలకు రూ.50 వేలు చొప్పున ఆర్థిక సాయం అందిస్తామన్న చెప్పి భాజపా నేతలు ఇప్పుడు విస్మరించారన్నారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు క్షీణించాయని, మహిళలకు రక్షణ కరవైందన్నారు.

ఎద్దేవా చేసిన భాజపా.. మరోవైపు భాజపా అధికార ప్రతినిధి మనోజ్ మహంతి భువనేశ్వర్‌లో విలేకరులతో మాట్లాడుతూ... 25 ఏళ్ల రాష్ట్రాన్ని పాలించిన నవీన్ 100 రోజుల పాలనపై విమర్శలు చేయడం సిగ్గుచేటు అని అభివర్ణించారు. బిజద పాలనంతా అవినీతి, అక్రమాలు, దుర్వినియోగానికి ప్రతీక నిలిచిందని, ఇప్పుడు ఆ పార్టీ అధినేత తామెంతో చేశామని చెప్పుకోవడం విడ్డూరమని ఎద్దేవా చేశారు.


జనసంపర్క పాదయాత్రలో నవీన్

రైఫిల్ షూటింగ్ పోటీల్లో సాయిబా, సుదీక్ష్యాలకు పతకాలు

బ్రహ్మపుర క్రీడలు, న్యూస్‌టుడే: పశ్చిమబెంగాల్‌లో ఇటీవల జరిగిన 8వ తూర్పు మండల రైఫిల్ షూటింగ్ పోటీల్లో రాష్ట్ర యువతులు అయిదు పతకాలు సాధించారు. ఈమేరకు ఉత్కళ కరాటే స్కూల్ కార్యదర్శి హరిప్రసాద్ పట్నాయక్ బుధవారం 'న్యూస్‌టుడే'కు ఆ వివరాలు వెల్లడించారు. ఒడిశా ఆదిత్య బిర్లా గగన్‌నారంగ్ షూటింగ్ శిక్షణ కేంద్రానికి చెందిన సాయిబా హరస్ 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ షూటింగ్‌లో రెండు పసిడి పతకాలు సాధించింది. ఇదే విభాగంలో జూనియర్ విభాగంలో సుదీక్ష్యా పాఢి ఒక పసిడి, రెండు కాంస్యపతకాలు గెలుచుకుంది.



పసిడి పతకాలతో క్రీడాకారిణి

గుసాని సమితిలో జన సంపర్కయాత్ర

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: బిజద పార్టీ అధ్యక్షుడు నవీన్ పట్నాయక్ పిలుపు మేరకు బుధవారం గుసానిసమితిలో జనసంపర్క యాత్ర నిర్వహించారు. సమితిలోని లావణ్యగడ ప్రాంతం నుంచి గారబంద గుసాని జంగలపాడు బాగుసల పంచాయితీల మీదుగా పాదయాత్ర జరిగింది. ప్రభుత్వం 100 రోజుల పాలనలో ఇచ్చిన హామీలను నేరవేర్చలేదని ఆరోపిస్తూ ఈ కార్యక్రమం చేపట్టారు. శాసనసభ్యుడు రూపేష్ పాణిగ్రహి, జడ్పీ అధ్యక్షుడు గవర తిరుపతిరావు, సమితి అధ్యక్షుడు ఎన్ వీర్రాజు, యువజన అధ్యక్షుడు శాసనం లింగరాజు, జడ్పీ సభ్యుడు ఎస్‌బాలరాజు, కాశీనగర్ సమితి అధ్యక్షురాలు బల్ల సాయమ్మ, పురపాలక అధ్యక్షురాలు నిర్మల శెఠి తదితరులు పాల్గొన్నారు.


పర్లాఖెముండి: పాదయాత్రలో పాల్గొన్న శాసనసభ్యుడు రూపేష్, గవర తిరుపతిరావు, లింగరాజు తదితరులు

అందరి సహకారంతోనే అభివృద్ధి


వేదికపై శివ, రమేష్. సరస్వతి,అప్పలస్వామి,నీలామాధవ

రాయగడ, న్యూస్‌టుడే: పార్టీలకు అతీతంగా అందరూ సహకరిస్తేనే జిల్లా అభివృద్ధి సాధ్యం అవుతుందని జిల్లా పరిషత్ అధ్యక్షురాలు సరస్వతి మాఝి అన్నారు. బుధవారం సాయంత్రం బిజు పట్నాయక్ సభా గృహంలో జరిగిన 32వ అవతరణ దినోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో రాయగడ శాసనసభ్యుడు అప్పలస్వామి కడ్రక పాల్గొని మాట్లాడారు. 24 ఏళ్ల బిజద పాలనలో జిల్లా అభివృద్ధికి నోచుకోలేదన్నారు. గత ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టారు. భాజపా రాష్ట్ర కార్యదర్శి రమేష్ చంద్ర సాహు, బిసంకటక్ శాసన సభ్యుడు నీలమాధవ హిక్కాక, భాజపా జిల్లా అధ్యక్షుడు శివ పట్నాయక్ పాల్గొన్నారు.

వన్యప్రాణుల సంరక్షణ మన బాధ్యత

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: గంజాం జిల్లా జీవవైవిధ్యానికి ప్రత్యేకమని, ఆలివ్ రిడ్లీ తాబేళ్లు, కృష్ణసార జింకలు, మొసళ్లు, మయూరాలు, ఏనుగుల తదితరాలకు ఇది నిలయమని, వాటి సంరక్షణ బాధ్యత మనదని వక్తలన్నారు. జాతీయ వన్యప్రాణి వారోత్సవాల సందర్భంగా గంజాం జిల్లా కుకుడాఖండి సమితిలోని గుండ్ బొండా గ్రామానికి చెందిన 'ఆంచలిక వికాస్ పరిషత్' ఆధ్వర్యంలో బుధవారం చైతన్య సమావేశం, ర్యాలీ జరిగింది. విద్యార్థులు వన్యప్రాణుల చిత్రాలతో గ్రామంలో చైతన్య ర్యాలీ నిర్వహించారు.


గ్రామంలో ర్యాలీ జరుపుతున్న విద్యార్థులు, నిర్వాహకులు

పయనమైన రాష్ట్ర జట్లు

బ్రహ్మపుర క్రీడలు, న్యూస్‌టుడే: హైదరాబాద్ (తెలంగాణా)లోని కేవీఆర్ ఇండోర్ మైదానంలో ఈ నెల 3వ తేదీ నుంచి 5వ తేదీ వరకు జరగనున్న జాతీయ 34వ జూనియర్ బాలబాలికల త్రోబాల్ పోటీలకు రాష్ట్ర జట్లు మంగళవారం బయలుదేరి వెళ్లాయి.


రాష్ట్ర జట్ల క్రీడాకారులు. చిత్రంలో క్రీడావిభాగం అధికారి, ఇతరులు

ప్రకృతిని రక్షించాలి

భువనేశ్వర్, న్యూస్‌టుడే: ప్రకృతి సంరక్షణ అందరి ధ్యేయం కావాలని, అభివృద్ధి వినాశనానికి దారి తీయకుండా ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని కేంద్ర అటవీ, పర్యావరణ శాఖల మంత్రి భూపేంద్ర యాదవ్ చెప్పారు. బుధవారం భువనేశ్వర్‌లో 'సంబాద్' గ్రూప్ సంస్థ యాజమాన్యం 'పునర్ సృష్టి' పేరిట మహా సమ్మేళనం చేపట్టింది. ముఖ్య అతిథిగా కేంద్ర మంత్రి పాల్గొన్నారు. వాతావరణ అధ్యయన శాఖ (ఐఎండీ) డైరెక్టర్ జనరల్ డాక్టర్ మృత్యుంజయ మహాపాత్ర ముఖ్యవక్తగా పాల్గొని మాట్లాడుతూ వాతావరణ నియంత్రణ చేయడం చర్యలు తీసుకోకపోతే భవితరాలు నిందించే పరిస్థితి ఉంటుందన్నారు. శాసనసభాపతి సురమాపాఢి, సంబాద్ గ్రూప్ సంస్థల అధ్యక్షుడు సౌమ్యరంజన్ పట్నాయక్, ప్రధాన సంపాదకురాలు తనయ పట్నాయక్, పర్యావరణ శాస్త్రవేత్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వేదికపై సంచికను ఆవిష్కరించారు.


సంచిక ఆవిష్కరిస్తున్న కేంద్రమంత్రి భూపేంద్ర, సౌమ్యరంజన్ తదితరులు

అంతర్‌జిల్లా లాన్‌బౌల్ విజేత బొలంగీర్

బ్రహ్మపుర క్రీడలు, న్యూస్‌టుడే: భువనేశ్వర్‌లోని కళింగ మైదానంలోని టెన్నిస్ కేంద్రంలో జరిగిన రెండో అంతర్‌జిల్లా లాన్‌బౌల్ పోటీలు మంగళవారం రాత్రి ముగిశాయి. బొలంగీర్ జట్టు పది పసిడి పతకాలతో విజేతగా నిలిచింది. తర్వాత స్థానాల్లో ఢెంకనాల్, సంబల్‌పూర్ జట్లు పురుషుల, మహిళా క్రీడకారులు నిలిచి పసిడి, రజత, కాంస్యపతకాలు గెలుచుకున్నారు.


పతకాల విజేతలు. చిత్రంలో అతిథులు, నిర్వాహకులు

హామీలు నెరవేర్చని భాజపా ప్రభుత్వం

సిమిలిగుడ, న్యూస్‌టుడే: భాజపా ప్రభుత్వంపై బిజద నేతలు విమర్శల వర్షం కురిపించారు. పార్టీ అధిష్ఠానం ఆదేశాల మేరకు గాంధీ జయంతి సందర్భంగా పాదయాత్ర కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా చేపడుతున్నారు. పొట్టంగి నియోజకవర్గానికి సంబంధించి ఈ కార్యక్రమాన్ని సువాయి నుంచి బుధవారం ప్రారంభించారు. జిల్లా అధ్యక్షుడు జీను హికాక నేతృత్వంలో మాజీ ఎమ్మెల్యేలు ప్రీతమ్ పాఢి, ప్రఫుల్ల కుమార్ పంగి, రఘురామ్ పడాల్, నియోజకవర్గ పర్యవేక్షకులు బాలరాయ, అమిత్ అగర్వాల్, నేత గోపాలక్రిష్ణ తదితరులు పాదయాత్రను బిలాపుట్ గ్రామం వరకు చేపట్టారు. వంద రోజుల పాలన నిర్వీర్యమని, ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని ఆరోపించారు.


సువాయిలో జరిగిన పాదయాత్రలో జీను, రఘురామ్, ప్రీతమ్, ప్రఫుల్ల తదితరులు

కలహాండిలో అతిసారం

నవరంగపూర్, న్యూస్‌టుడే: నవరంగపూర్ జిల్లా పపడహండి సమితికి సరిహద్దు ప్రాంతమైన కలహాండి జిల్లా జయపట్నం సమితిలోని దాలిగి పాటిలో అతిసారం విజృంభించింది. బుధవారం గ్రామానికి చెందిన బిజయినీ, సుకీల్ దేయ మరణించారు. ఆసుపత్రిలో చేరారు. జిల్లా ప్రధాన వైద్యులు డా.మానసరంజన్ పాణిగ్రాహి, డా.ఆశుతోష్ మిత్రా అతిసారంగా నిర్ధారించారు. మెరుగైన వైద్యం కోసం పపడహండి ఆసుపత్రికి తరలించారు. గత వారం రోజులుగా ఈ వ్యాధి విజృంభించిందని గ్రామస్థులు తెలిపారు.


ఆసుపత్రిలో వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

ఆర్ఆర్‌బీ స్వర్ణోత్సవాల సందడి

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: 'రీజనల్ రూరల్ బ్యాంకులు' (ఆర్ఆర్‌బీ, గ్రామీణ బ్యాంకులు) స్వర్ణోత్సవ సంవత్సర కార్యక్రమాలు బుధవారం గాంధీ జయంత్యుత్సవం రోజున ప్రారంభమయ్యాయి. ఉత్కళ గ్రామీణ బ్యాంకుకు చెందిన వివిధ ఉద్యోగ సంఘాల ప్రతినిధులు ఉదయం సుబ్బారావు కూడలిలోని బ్యాంకు ప్రాంతీయ కార్యాలయం నుంచి ర్యాలీ నిర్వహించారు.



నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

రాయగడ, న్యూస్‌టుడే: రాయగడ పట్టణంతో పాటు పితామహల్, జిమిడిపేట, జేకే పూర్ ప్రాంతాల్లో గురువారం విద్యుత్తు సరఫరాకు ఆటంకం కలుగుతుందని ఆ శాఖ కార్య నిర్వాహణ ఇంజినీర్ సంతోష్ కుమార్ సాహు తెలిపారు. మరమ్మతుల కారణంగా ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 వరకు సేవలు నిలిపివేస్తున్నట్లు చెప్పారు. వినియోగదారులు సహకరించాలన్నారు.

నేటి నుంచి శరన్నవరాత్రి మహోత్సవాలు

రాయగడ, న్యూస్‌టుడే: శరన్నవరాత్రి మహోత్సవాలు 9 రోజుల పాటు అంగరంగ వైభవంగా, భక్తి శ్రద్ధలతో నిర్వహించేందుకు అమ్మవారి ఆలయాల్లో భారీ ఏర్పాట్లు పూర్తి చేశారు. భక్తుల పాలిట కొంగుబంగారం రాణిగుడ ఫారం పైడితల్లి అమ్మవారి ఆలయంలో ఉత్సవాలకు ఏర్పాట్లు సిద్ధం అయ్యాయి. గురువారం నదీ జలాలను శోభా యాత్రగా తెచ్చి వచ్చి ఆలయ శుద్ధి, పుణ్యాహవచనం, కలశారాధన, మండపారాధన, ప్రత్యేక అలంకరణ, పూజలు ,శక్తి హోమం నిర్వహించనున్నారు. మజ్జిగౌరీ ఆలయం, వనదుర్గ, మా మంగళ, దుర్గా మందిరం, కల్యాణ వేంకటేశ్వర ఆలయం, కస్తూరీనగర్ సత్యన్నారాయణ ఆలయంలోనూ ఘనంగా జరగనున్నాయి.


రాయగడ పైడితల్లి అమ్మవారు

మాకు ఆశ్రయం కల్పించండి

● బెజ్జిపురం చిరువ్యాపారుల డిమాండ్

బ్రహ్మపుర బజారు, న్యూస్‌టుడే: బ్రహ్మపుర నగరపాలక సంఘం (బీఈఎంసీ)లో ఎన్నో ఏళ్ల నుంచి చిరువ్యాపారాలు చేసుకుంటూ జీవిస్తున్నామని, తమకు మరోచోట ఆశ్రయం కల్పించకుండా హఠాత్తుగా తోపుడు బళ్లు తొలగిస్తున్నారని, తామెలా బతకాలని బెజ్జిపురం తోపుడు బళ్ల వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈమేరకు బుధవారం పలువురు చిరువ్యాపారులు బెజ్జిపురం ప్రధాన రహదారిలోని మా సంతోషి మాత మందిరం ఎదుట నిరసన ప్రదర్శన చేపట్టారు.



సంతోషిమాత మందిరం ఎదురుగా రహదారి పక్కన నిరసన ప్రదర్శన చేస్తున్న చిరువ్యాపారులు

స్వచ్ఛత, సంస్కారం ధ్యేయంగా


బ్రహ్మపురలోని గాంధీనగర్ మెయిన్‌రోడ్డులో స్వచ్ఛభారత్ కార్యక్రమంలో మంత్రి విభూతిజెనా

పూజ్య బాపూజీ విశ్వమానవ కళ్యాణం కోరుకున్నారని, ఆయన సేవలు చిరస్మరణీయమని ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి చెప్పారు. గాంధీ జయంతి పురస్కరించుకుని ప్రముఖ శిల్పి సుదర్శన్ పట్నాయక్ పూరీ తీరంలో సైకతశిల్పం తీర్చిదిద్దారు. స్వచ్ఛత, సంస్కారం, స్వభావం బాగుండాలని సందేశమిచ్చారు. సందర్శకులకిది ఆకర్షించింది. ఈ సందర్భంగా పలు ప్రాంతాల్లో పరిసరాలను శుభ్రం చేశారు. కొరాపుట్, గుణుపురం, పర్లాఖెముండిలో ఈ వేడుకలను ఘనంగా నిర్వహించారు.

– న్యూస్‌టుడే, భువనేశ్వర్, గోపాలపూర్



పూరీ తీరంలో సందేశాత్మక సైకత శిల్పం

రేపు బంగాళాఖాతంలో అల్పపీడనం

గోపాలపూర్, న్యూస్‌టుడే: దక్షిణ, తూర్పు బంగాళాఖాతంలో బంగ్లాదేశ్‌కు చేరువలో బుధవారం ఆవర్తనం ఏర్పడింది ఇది 4న అల్పపీడనంగా బలం పుంజుకుని పశ్చిమబెంగాల్, ఒడిశా సరిహద్దు తీరానికి చేరువయ్యే సూచనలున్నాయని గోపాల్‌పూర్ వాతావరణ అధ్యయనం కేంద్రం (ఐఎండీ) అధికారి కె.ఎస్.మూర్తి 'న్యూస్‌టుడే'కు చెప్పారు. పీడనం ప్రభావంతో శుక్రవారం ఉత్తరకోస్తా ప్రాంతాల్లో వర్షాలకు అవకాశం ఉందన్నారు.

రక్త దాతలకు ప్రత్యేక అభినందనలు

కొరాపుట్, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రం కొరాపుట్‌లో బుధవారం కొరాపుట్ ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రక్తదాతలను ప్రత్యేకంగా అభినందించారు. ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు భవానీ శంకర మిశ్ర పాల్గొని 40 మంది రక్తదాతలను సత్కరించారు.

వెయ్యి చీరల వితరణ

ఖరగ్‌పూర్, న్యూస్‌టుడే: పట్టణ ఖరీదా బిధాన్ పల్లి ప్రాంతంలోని శ్రీ సోలాపురి అమ్మవారి ఆలయం కమిటీ దుర్గా దేవి పూజల పురస్కరించుకొని పేదలకు వెయ్యి చీరలు బుధవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా తృణమూల్ కాంగ్రెస్ జిల్లా కమిటీ కార్యదర్శి దేబాశిష్ చౌదరి, వార్డు 17 కౌన్సిలర్ నమితా చౌదరి పాల్గొన్నారు.

మల్కాన్‌గిరి ఎస్పీగా వినోద్ పాటిల్

భువనేశ్వర్, మల్కాన్‌గిరి, న్యూస్‌టుడే: మల్కాన్‌గిరి ఎస్పీగా వినోద్ పాటిల్ నియమితులయ్యారు. రాహుల్‌గోయల్ కటక్ రైల్వే ఎస్పీగా బదిలీ అయ్యారు. బుధవారం హోంశాఖ వీరిద్దరి నియామకాలపై ఉత్తర్వులు జారీ చేసింది.

ఎస్పీ స్వాతికి ఘనంగా వీడ్కోలు

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: గజపతి ఎస్పీగా 21 నెలలు సేవలందించి బదిలీపై వెళ్తున్న ఎస్పీ స్వాతి ఎస్ కుమార్‌కు అధికారులు ఘనంగా వీడ్కోలు పలికారు. రాణిపేట గ్రామ ప్రాంతంలోని ఎస్పీ కార్యాలయంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. పాలనాధికారి బిజయ్ కుమార్ దాస్ , అదనపు పాలనాధికారి రాజేంద్ర మింజ్, జడ్పీ కార్య నిర్వహణ అధికారి గుణనిధి పాల్గొన్నారు.

పరిశుభ్రతతో ఆరోగ్యం

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో ఆరోగ్యంగా ఉంటామని పాలనాధికారి బిజయ్ కుమార్ దాస్ అన్నారు. బుధవారం జిల్లా ప్రధానాసుపత్రి ప్రాంగణంలో స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య వైద్యాధికారి ఎం ఎం అలీ తదితరులు పాల్గొన్నారు.


చెత్తను తొలగిస్తున్న పాలనాధికారి బిజయ్ కుమార్ దాస్, వైద్య సిబ్బంది

బిజద జనసంపర్క పాదయాత్ర ప్రారంభం



బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: బ్రహ్మపుర అసెంబ్లీ నియోజకవర్గం బిజద ఆధ్వర్యంలో 'జనసంపర్క పాదయాత్ర' బుధవారం ప్రారంభమైంది. ఉదయం గాంధీనగర్ కూడలి నుంచి ప్రారంభమైన ఇది రామలింగేశ్వర పార్కు రోడ్డులోని గాంధీ పార్కు వద్ద ముగిసింది.

రహదారి పక్కన యువకుడి మృతదేహం: పోలీసులపై చర్యలు

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: కొంధమాల్ జిల్లా గొచ్చాపడ ఠాణా పరిధిలోని డంగశాము ఘాటీ మార్గంలో బౌద్ధ్ జిల్లా కంటామాల్ ఠాణా ప్రాంతానికి చెందిన యువకుడి మృతదేహం అనుమానాస్పద స్థితిలో కనిపించింది. అది తన భర్తదేనని, ఆయనను పోలీసులు హతమార్చారని ఒక మహిళ ఠాణాలో ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. ఈ ఘటనలో దర్యాప్తుపై ప్రభావం పడకుండా ఉండేందుకు ఠాణా శిక్షణ ఏఎస్సై, హవల్దారును సస్పెండు చేశామని, ముగ్గురు హోంగార్డులను విధుల నుంచి తొలగించామని అదనపు ఎస్పీ బలభద్ర దీప్ మంగళవారం విలేకరులకు చెప్పారు. ఆ యువకుడు మరొకరితో కలిసి సెప్టెంబరు 26న ఉదయం గొచ్చాపడ వచ్చాడు. మధ్యాహ్నం సుమారు 12 గంటల ప్రాంతంలో భార్యకు ఫోను చేసి పోలీసులు తనను అదుపులోకి తీసుకున్నారని తెలిపాడు. ఆ తర్వాత నుంచి ఆయన ఫోను స్విచ్ఛాఫ్ చేసి ఉంది. దీంతో బాధిత మహిళ సాయంత్రం గొచ్చాపడ ఠాణాకు వెళ్లి పోలీసులను అడగ్గా తాము ఆమె భర్తను అదుపులోకి తీసుకోలేదని, ఆయనతో పాటు ఉన్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. వారు అదుపులోకి తీసుకున్నట్లు చెబుతున్న వ్యక్తి ఇచ్చిన సమాచారం మేరకు డంగశాము ఘాటీ మార్గంలో మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై దర్యాప్తు ముమ్మరంగా చేస్తున్నామని, అన్ని కోణాల్లో వివరాలు సేకరిస్తున్నామని అదనపు ఎస్పీ దీప్ పేర్కొన్నారు.

బిసంకటక్‌లో యువకుడు దారుణహత్య

రాయగడ పట్టణం, మునిగుడ, న్యూస్‌టుడే: రాయగడ జిల్లా బిసంకటక్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ యువకుడు దారుణ హత్యకు గురైన ఘటన మంగళవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం చటికోన గ్రామం మహివీధిలో ఓ వ్యక్తి మృతదేహాన్ని బుధవారం ఉదయం గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. యువకునిపై గొడ్డలితోదాడి చేయడంతో మృతి చెందినట్లు పోలీసులు ప్రాథమిక విచారణలో తేలింది. మృతుడు ఘాసీరాం జీలకరగా గుర్తించగా, హత్యకు సంబంధించి నలుగురు అనుమానితులను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. శాస్త్రీయ బృందం ఘటనా స్థలానికి చేరుకొని ఆధారాలు సేకరించగా, ఘాసీరాం హత్యకు గల కారణాలు తెలియరాలేదని పోలీసులు వెల్లడించారు.

గంజాయి స్వాధీనం..ఇద్దరి అరెస్ట్

జయపురం, న్యూస్‌టుడే: అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరిని జయపురం పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి 10 పొట్లాల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. దర్యాప్తు అనంతరం నిందితుల వివరాలు తెలియజేస్తామని ఐఐసీ రమణి తెలిపారు. ఎస్సై సిద్ధార్థ్ కుమార్ నేతృత్వంలో బుధవారం ఉదయం భూత్‌నాథ్ ఆలయం వద్ద తనిఖీలు నిర్వహిస్తున్నారు. బొయిపరిగూడ నుంచి జయనగర్ మీదుగా నవరంగపూర్ వైపుగా వెళ్తున్న కారు అతి వేగంగా వెళ్తుండటంతో పోలీసులు అనుమానంతో ఆపి తనిఖీలు చేయగా గంజాయి రవాణా చేస్తున్నట్లు గుర్తించారు. గురువారం వీరిని కోర్టులో హాజరుపరచనున్నట్లు తెలిపారు.

బైక్, స్కూటి ఢీకొని అయిదుగురికి గాయాలు

● ఒకని పరిస్థితి విషమం

రాయగడ గ్రామీణం,న్యూస్‌టుడే; రాయగడ జిల్లా కళ్యాణసింగుపూర్ సమితి సింగారి పంచాయతీ డెప్పగూడ మలుపు రోడ్డులో బుధవారం స్కూటీ, బైక్ ఢీకొని అయిదుగురు గాయపడ్డారు. వాహనచోదకుడు కృప బైసాకి తీవ్ర గాయలయ్యాయి. స్థానికుల సమాచారంతో పోలీసులు క్షతగాత్రుడిని రాయగడ జిల్లా ఆసుపత్రికి తరలించారు. వీరితో పాటు గోకుల మాలి, స్కూటీపై వస్తున్న లచ్చన హికాక, రామదాస్ సరక, సురేష్ సరకలను కె.సింగుపూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్చి చికిత్స అందిస్తున్నారు. కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న టిప్పర్: యువకుడు దుర్మరణం

సిమిలిగుడ, న్యూస్‌టుడే: కొరాపుట్ జిల్లా సిమిలిగుడ పట్టణంలో దమన్‌జోడి కూడలి వద్ద బుధవారం ఉదయం ద్విచక్ర వాహనాన్ని టిప్పర్ ఢీకొని ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం లమతపుట్ సమితి బనమాలిపుట్ పంచాయతీ పరిధిలో లమండ గ్రామానికి చెందిన విశ్వరంజన్ మండల్ నాయక్ (17). సిమిలిగుడ పట్టణానికి ద్విచక్రవాహనంపై జాతీయ రహదారి మీదుగ వెళ్తుండగా ఎదురుగా వచ్చిన టిప్పర్ ఢీకొంది. ఈ ప్రమాదంలో విశ్వరంజన్ కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు టిప్పరును సీజ్ చేసి మృతదేహాన్ని పరీక్షకు తరలించారు.

అత్యాచారం కేసులో ఒకరి అరెస్ట్

జయపురం, న్యూస్‌టుడే: కిశోర బాలికపై అత్యాచారం చేసిన కేసులో జయపురం పోలీసులు ఒకరిని అరెస్ట్ చేశారు. నిందితుడు సదరు సమితికి జాముండా పంచాయతీ చికిమార గ్రామానికి చెందిన బుడునాగ్‌గా గుర్తించారు. ఐఐసీ అనితా తెలిపిన వివరాలు ప్రకారం... బొరిగుమ్మ ఠాణా పరిధిలో కిశోరబాలికకు రెండు రోజుల క్రితం ఆరోగ్యం క్షీణించటంతో కుటుంబీకులు ఆసుపత్రికి తీసుకెళ్లారు. వైద్యులు పరీక్షించగా గర్భవతి అని నిర్ధారించారు. బాలికను ఆరా తీయగా బుడు ఆమెపై అత్యాచారం చేశాడని, ఎవరికైనా చెబితే చంపేస్తానని హెచ్చరించాడని తెలిసింది. ఈ మేరకు బాధితురాలి కుటుంబ సభ్యులు మంగళవారం మహిళా ఠాణాలో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేశారు.

పిడుగు పాటుకు గురైన ఆవులు మృత్యువాత

నవరంగపూర్, న్యూస్‌టుడే: నవరంగపూర్ జిల్లా టెంటులిఖుంటి సమితిలో పిడుగుపాటుకు గురై మూడు ఆవులు మృతి చెందాయి. వివరాల్లోకి వెళ్తే... పాత్రపుట్ పంచాయతీ టిమన పూర్ గ్రామానికి చెందిన త్రినాథ్ హరిజన్ గోవులను మేతకు పొలాల్లో విడిచిపెట్టి వచ్చాడు. ఉదయం నుంచి కురిసిన వర్షంలో పిడుగుపాటుకు గురై ఆవులు మృతి చెందాయి. బాధితుడిన్ని యంత్రాంగం ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

గుర్తుతెలియని వృద్ధుడు మృతి



జయపురం, న్యూస్‌టుడే: జయపురంలోని జిల్లా ప్రధాన ఆసుపత్రిలో గుర్తు తెలియని వృద్ధుడు బుధవారం ఉదయం మృతి చెందాడు. గత నెల 19వ తేదీన అపస్మారక స్థితిలో పడి ఉన్న ఈయనను స్థానికులు ఆసుపత్రిలో చేర్చారు. అక్కడే చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. ఆయన వివరాలు తెలియకపోవడంతో సిబ్బంది మృతదేహాన్ని శవాలగదిలో ఉంచారు. 96 గంటల్లో బంధువులు రాకపోతే ఆసుపత్రి నిబంధనల ప్రకారం పోలీసు శాఖ తరపున అంత్యక్రియలు నిర్వహిస్తామని ఐఐసీ రంజన్ దొళాయి తెలిపారు.

తిరుమల పవిత్రత కాపాడుకుందాం


ఉపముఖ్యమంత్రి ప్రాయశ్చిత్త యాత్రకు మద్దతుగా పార్వతీపురంలో నిర్వహించిన ప్రదర్శనలో ఎమ్మెల్యే విజయచంద్ర

పార్వతీపురం, పురపాలక, న్యూస్‌టుడే: తిరుమల పవిత్రతను కాపాడుకోవడానికి, గత ప్రభుత్వ తప్పిదాల కారణంగా జరిగిన అపచారాలకు ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత్త యాత్రకు పార్వతీపురం ఎమ్మెల్యే విజయచంద్ర సంఘీభావం ప్రకటించారు. ప్రాయశ్చిత్త యాత్ర ముగింపు రోజున నగర సంకీర్తన కార్యక్రమానికి జనసేన పిలుపునిచ్చిన నేపథ్యంలో ఆ శ్రేణులతో కలసి పట్టణంలో ప్రదర్శన నిర్వహించారు. వేంకటేశ్వరస్వామి చిత్రపటాలను పట్టుకొని, నుదుటన బొట్టు ధరించి పట్టణంలో ప్రదర్శన చేసి, బెలగాంలోని గుడికి వెళ్లి పూజలు చేశారు. గరుగుబిల్లి మండలం తోటపల్లి వేంకటేశ్వరస్వామి దేవస్థానానికి వెళ్లి అక్కడ శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు.

4న కలెక్టరేట్ వద్ద ధర్నా


దీక్ష శిబిరంలో కార్మికులు, సంఘనాయకులు

కలెక్టరేట్ ప్రాంగణం, న్యూస్‌టుడే: ఉచిత ఇసుక విధానంపై ఇచ్చిన హామీని నెరవేర్చాలని డిమాండు చేస్తూ ఈనెల 4న కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టనున్నట్లు సిటు జిల్లా కార్యదర్శి యామల మన్మథరావు అన్నారు. బుధవారం కలెక్టరేట్ వద్ద దీక్ష శిబిరంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ ఇసుక విధానం వల్ల కార్మికులు నష్టపోయారని, ఆ తప్పులు కూటమి ప్రభుత్వం చేయకూడదన్నారు.

చిట్టి చేతుల సహాయం


ఎమ్మెల్యేకు నగదు అందిస్తున్న విమలాదేవి

గుమ్మలక్ష్మీపురం: విజయవాడ వరద బాధితులకు స్థానిక సరస్వతీ విద్యానికేతన్ చిన్నారులు తాము సైతం అంటూ రూ.10 వేలు పోగుచేశారు. మొత్తాన్ని కరస్పాండెంట్ విమలాదేవి ఎమ్మెల్యే జగదీశ్వరికి అందించారు. చిట్టి చేతుల సహాయానికి ఎమ్మెల్యే అభినందనలు తెలిపారు.

పంటలు సమృద్ధిగా పండాలి


కొండ దేవతకు వరద పాశం పోసి పూజలు చేస్తున్న మహిళలు

భామిని, న్యూస్‌టుడే: పంటలు సమృద్ధిగా పండి రైతులు సుభిక్షిగా ఉండాలని వడ్డంగి గ్రామస్థులు కొండమ్మ తల్లిని కోరుకున్నారు. బుధవారం దేవతకు వరద పాశం పోసి ప్రత్యేక పూజలు నిర్వహించి మంగళవాయిద్యాల మధ్య యువకులు, చిన్నారులు, మహిళలు సందడిగా వెళ్లి మొక్కులు చెల్లించుకున్నారు.

బడ్డీలే అడ్డాలు..!

● యథేచ్ఛగా గంజాయి విక్రయాలు ● యువతే లక్ష్యంగా వ్యాపారం



జిల్లాలో గంజాయి ముఠాలు పేట్రేగిపోతున్నాయి. సరకు ఎంత కావాలంటే అంత, ఎక్కడికి కావాలంటే అక్కడికి, ఎంత మోతాదులోనైనా ఏ సమయానికైనా సరఫరా చేయడానికి సిద్ధం అంటున్నాయి.. రవాణాకు పోటీగా వినియోగం పెరుగుతోంది.. ఎక్కువగా తెలిసీ తెలియని వయసులో ఉన్నవారిని లక్ష్యంగా చేసుకుని దందా సాగుతోంది.. చౌకగా కొనుగోలు చేసి దానికి రెండింతల ధరకు విక్రయిస్తున్నారు. చాలా వరకు బడ్డీలను కేంద్రాలుగా చేసుకుంటున్నారు.

– ఈనాడు డిజిటల్ శ్రీకాకుళం, న్యూస్‌టుడే నేరవార్తా విభాగం

★ ఇటీవల ఆమదాలవలస మండలం మెట్టక్కివలసలో 20 ఏళ్లలోపు వయసు ఉన్న ఇద్దరు రెండు కిలోలకు పైగా గంజాయితో పోలీసులకు చిక్కారు. తక్కువ ధరకు సరకు కొనుగోలు చేసి గ్రామీణ ప్రాంతాల్లో యువతకు విక్రయించడానికి తీసుకొచ్చినట్లుగా తేలింది.

★ ఈ నెల 9న ఇచ్ఛాపురం శివారు పురుషోత్తపురం వద్ద ఓ బడ్డీలో 25 కిలోల గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. చిన్న పొట్లాలుగా చేసి విక్రయిస్తున్నట్లు సమాచారం. గతేడాది డిసెంబరులో ఇక్కడి చెక్‌పోస్టు వద్ద చిన్న దుకాణంలో వంద కిలోలకు పైగా సరకు దొరికింది.

★ శ్రీకాకుళం నగరంలోని ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ఇటీవల గంజాయి, సిగరెట్లు తాగుతున్న ఆనవాళ్లు కనిపించాయి. పోలీసులు రంగంలోకి దిగి ఆర్టీసీ అధికారులతో మాట్లాడి శిథిలావస్థకు చేరిన భవన సముదాయాన్ని మూసివేయించారు.

★ శ్రీకాకుళం నగరంలో గంజాయి విక్రయిస్తున్న తొమ్మిది మంది యువకులను ఇటీవల పోలీసులు అరెస్టు చేశారు. 22 కిలోల సరకు స్వాధీనం చేసుకున్నారు.

★ అరసవల్లి నుంచి కలెక్టరేట్ వరకు నిర్మించిన 80 అడుగుల రహదారిలో రాత్రి వేళ గంజాయి దట్టించిన సిగరెట్లను కొందరు యువకులు తాగుతున్నారు. మరి కొందరు నాగావళి నది ఒడ్డున కూర్చొని పీలుస్తున్నారు.

★ పలాస మండలం అల్లుఖోల, రెంటికోట గ్రామాల మధ్యలో ఓ కొండ వద్ద గంజాయి విక్రయాలు సాగిస్తున్నారు. రాత్రి వరకు కొందరు అక్కడే ఉండి తాగుతున్నట్లు సమాచారం.

ఒక్కో సిగరెట్ రూ.150

గంజాయి వినియోగిస్తున్న వారిలో యువతే ఎక్కువ. కొందరు బానిసలుగా మారుతున్నారు. చిన్న వయసులోనే అలవాటు అవడంతో జీవితాన్ని చిన్నాభిన్నం చేసుకుంటున్నారు. బడ్డీల్లో 50, 100 గ్రాముల పరిమాణంలో పొట్లాలు విక్రయిస్తున్నారు. కొందరు దుకాణదారులు సిగరెట్లలో గంజాయి దట్టించి ఒక్కోటి రూ.150 నుంచి రూ.300 వరకు అమ్ముతున్నారు. హుక్కాలో పీల్చి తాగడానికి వీలుగా పరికరాలను సమకూరుస్తున్నారు. ★ కొందరు సైకిల్ ట్యూబ్‌కి ప్యాచ్‌లు వేసే ద్రావణాన్ని కొనుగోలు చేసి వస్త్ర ముక్కల్లో వేసుకొని పీల్చుతున్నారు. చాలా మంది దీనికే మక్కువ చూపుతున్నారు. వైట్‌నర్, ఆల్ అవుట్, శానిటైజర్‌లో స్పిరిట్ శాతం ఉండటంతో మత్తు కోసం రకరకాలుగా పీలుస్తున్నారు.

జీవితాలు చిన్నాభిన్నం..

శ్రీకాకుళం నగరంలోని సర్వజనాసుపత్రిలో వ్యసన విముక్తి కేంద్రానికి మూడేళ్లుగా గంజాయి, మత్తు, మాదకద్రవ్యాలకు అలవాటు పడిన సుమారు 200 మంది చికిత్స కోసం వచ్చారు. వీరిలో ఎక్కువగా యువత ఉండటం గమనార్హం. ఎక్కువగా మతిమరుపు, మెదడు సంబంధిత సమస్యలు, కడుపులో మంట, నరాల బలహీనత, కంటి చూపుపై ప్రభావం, నడవడికలో మార్పులు గమనించినట్లు వైద్యులు చెబుతున్నారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాలు స్థానికంగా అందుబాటులో ఉండటంతో వినియోగిస్తున్నామని చికిత్స కోసం వచ్చిన వారు వైద్యులకు చెబుతున్నారని సమాచారం.


శ్రీకాకుళం నగరంలోని ఆర్ట్స్ కళాశాల ఆవరణలోని ఓ వసతిగృహ భవనంలో పీల్చి వదిలేసిన మత్తు పదార్థాల పొట్లం.. ఇలాంటివి కుప్పలుగా ఉన్నాయి. మత్తుబాబులకు అడ్డాగా ఈ ప్రాంతం మారింది.

తెలిసిన వారికే అమ్మకం..

ఒడిశాలోని పర్లాఖిముండి, బ్రహ్మపుర తదితర ప్రాంతాల నుంచి రైళ్లు, బస్సుల్లో సరకు తీసుకొస్తున్నారు. అక్కడ కిలో రూ.5 వేలకు కొనుగోలు చేస్తున్నారు. స్థానిక అవసరాలకు కొంత ఉంచుకుని కొంత బెంగళూరు, హైదరాబాద్, గుజరాత్ తరలిస్తున్నారు. కిలో రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకు విక్రయిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఒక బడ్డీ నుంచి ఎంపిక చేసుకున్న గ్రామాలకు సరకు తరలిస్తున్నారు. ఇక్కడ తెలిసిన వారికి కోడ్ భాషలో అడిగితేనే అమ్ముతారు.


శ్రీకాకుళం నగరంలోని డే అండ్ నైట్ కూడలి వద్ద రెండో పట్టణ పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి పొట్లాలు.

జీవితాలు పాడుచేసుకోవద్దు

జిల్లాలో గంజాయి రవాణాకు అడ్డుకట్ట వేస్తున్నాం. వినియోగం లేకుండా చూస్తున్నాం. యువత మత్తు ఉచ్చులో పడి జీవితాలను పాడు చేసుకోవద్దు. ఇటీవల పట్టుబడిన 20 మందిని విశాఖలోని వ్యసన విముక్తి కేంద్రానికి తరలించాం. ఎక్కడికక్కడ కళాశాలల్లో అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నాం. గంజాయి విక్రయించినా, సేవిస్తూ పట్టుబడినా చట్టపరంగా చర్యలు తీసుకుంటాం. – కె.వి.మహేశ్వర రెడ్డి, ఎస్పీ శ్రీకాకుళం

నకిలీ విత్తనాల విక్రయాలపై కేసులు

మక్కువ, న్యూస్‌టుడే: మండలంలోని నంద గిరిజన రైతులకు నాసిరకం మొక్కజొన్న విత్తనాలు విక్రయించిన డీలర్లపై క్రిమినల్ కేసులు పెట్టాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కె.గంగానాయుడు, ఆదివాసీ మండల కార్యదర్శి టి.ప్రభాకర్ డిమాండ్ చేశారు. బుధవారం గ్రామంలోని మొక్కజొన్న పంటను పరిశీలించారు. గిరిజన రైతులు నష్టపోయారని, వారిని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. డీలర్లు విత్తనాలు, ఎరువులు, మందులు విక్రయాలు చేపట్టినప్పుడు తెల్ల కాగితాలపై బిల్లులు రాస్తున్నారని ఆరోపించారు.

సంకేతాలు అందక అవస్థలు


సీతంపేట, న్యూస్‌టుడే: సీతంపేట పరిధిలోని పలుగ్రామాల్లో సెల్‌ఫోన్ సంకేతాలు పూర్తిస్థాయిలో అందడం లేదు. దీంతో గిరిజనులు ప్రభుత్వ పథకాల లబ్ధికి ఇబ్బందులు పడుతున్నారు. సీతంపేట మండలం రామానగరం, డబర, పెద్దగూడ, రామానగరం కాలనీ, చీడిమానుగూడ, చింతగూడ తదితర గ్రామస్థులు మూడు కి.మీ దూరంలోని కోసంగి కూడలికి వచ్చి సంబంధిత పనులు చేసుకోవాల్సి వస్తోంది.

చిరుధాన్యాల సాగు విస్తీర్ణం పెంచాలి


చోడిపంటను పరిశీలిస్తున్న రాష్ట్ర ప్రకృతి వ్యవసాయ విస్తరణ రిసోర్స్ పర్సన్

గరుగుబిల్లి, న్యూస్‌టుడే: ప్రతి గ్రామంలో చిరుధాన్యాల విస్తీర్ణం పెంచాలని రాష్ట్ర ప్రకృతి వ్యవసాయం విస్తరణ రిసోర్స్ పర్సన్ పి.దేవుళ్లు అన్నారు. ఆయన బుధవారం నందివానివలసలో చోడిపంటను (రాగులు) పరిశీలించారు. చిరుధాన్యాల ప్రాధాన్యతను గుర్తించి కేజీ రూ.40 ప్రకటించిందన్నారు. రాగుల సాగులో తక్కువ పెట్టుబడితో రైతులు ఎక్కువ లాభాన్ని పొందగలరన్నారు. ఎన్‌ఎఫ్‌ఏ గొల్లు అన్నపూర్ణ, కామేశ్, శ్రీధర్, శ్రీకాంత్, హరికృష్ణ, సరోజిని, లావణ్య ఉన్నారు.

నేటి నుంచి దసరా నవరాత్రి ఉత్సవాలు


చినమేరంగిలో వేసిన భారీ సెట్

కురుపాం గ్రామీణం, జియ్యమ్మవలస, న్యూస్‌టుడే: కురుపాంలోని రావాడ కూడలి వద్ద కొలువైన కోటదుర్గమ్మ తల్లి ఆలయ ప్రాంగణంలో 3 నుంచి 12 వరకు నవరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ● జియ్యమ్మవలస మండలంలో పలు గ్రామాల్లో గురువారం నుంచి ప్రారంభమయ్యే దుర్గా నవరాత్రి ఉత్సవాలకు మండపాలను సిద్ధం చేశారు. చినమేరంగిలో సాయిరాం గుడి సమీపంలో వేసిన భారీ సెట్ చూపరులను ఆకట్టుకుంటోంది.

దుకాణాల టెండరు ప్రక్రియ పరిశీలన: సీతానగరం, న్యూస్‌టుడే: ప్రైవేటు మద్యం దుకాణాలకు దరఖాస్తుల స్వీకరణను అబ్కారీ శాఖ ఉన్నతాధికారి బి.జీవన్ కిశోర్ పరిశీలించారు. బుధవారం స్థానిక కార్యాలయంలో టెండరు ప్రక్రియను పరిశీలించి, సిబ్బందికి సూచనలందించారు. ఆయన వెంట సీఐ పద్మావతి, ఎస్ఐ రాజశేఖర్ పట్నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

పోలేరమ్మగా కనకదుర్గమ్మకు పూజలు



పార్వతీపురం గ్రామీణం, న్యూస్‌టుడే: పట్టణం సమీపంలోని వెంకంపేట కూడలిలో కనకదుర్గ అమ్మవారిని పోలేరమ్మగా అలంకరించి మహిళలు పూజలు చేశారు. బుధవారం ఉదయం వెంకంపేట, వైకేఎం కాలనీ, బాలజీనగర్, పట్టణ శివారు కాలనీల మహిళలు ముందుగా దుర్గ చెట్టుకు పసుపు రాసి బొట్లు పెట్టి దేవీ ఆర్చనలో పాల్గొన్నారు. ఇళ్లలో కందచెట్లను పోలేరమ్మగా ఏర్పాటు చేసుకుని ముత్తైదువలు ప్రత్యేక అష్టోత్తర నామావళి పూజలు చేసి, వాయినాలు ఇచ్చి పుచ్చుకున్నారు.

ఆగని రైళ్లు.. ప్రయాణికులకు పాట్లు!

● ఇచ్ఛాపురంలో మరిన్ని నిలిపితే సౌకర్యం
● ఆదాయం పెరగడానికి అవకాశం
● 4న ఖుర్దా డివిజన్ రైల్వే ప్రత్యేక సమావేశం

న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

ఆంధ్రా ముఖద్వార రైలు నిలయం ఇచ్ఛాపురం. ప్రయాణికుల సంఖ్య పెరుగుతుండటంతో క్రమేపీ ఆదాయం పెరుగుతోంది. ఉద్దానం, ఒడిశాలోని చికిటి, గోపాల్‌పూర్ నియోజకవర్గ ప్రజలు ఇక్కడి నుంచి ఎక్కువగా ప్రయాణం సాగిస్తారు. రూ.పది కోట్ల వార్షికాదాయం, 6.83 లక్షల ప్రయాణికులతో ఎన్‌ఎస్‌జీ గ్రేడ్ 4 దక్కించుకుంది. కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, ఎమ్మెల్యే బెందాళం అశోక్ కృషి ఫలితంగా అమృత్‌భారత్‌లో ఇచ్ఛాపురాన్ని ఎంపిక చేసి అభివృద్ధి చేస్తున్నారు. ఇక్కడి సమస్యలు పరిష్కరించి మరిన్ని రైళ్లు ఆగేలా కేంద్ర మంత్రి చొరవ చూపాలని ప్రయాణికులు కోరుతున్నారు. ఈ నెల 4న ఖుర్దా డివిజన్ పరిధి ఎంపీలతో రైల్వే ఉన్నతాధికారుల ప్రత్యేక సమావేశం భువనేశ్వర్‌లో నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో ఇచ్ఛాపురం, సోంపేట ఆర్ఎస్, జాడుపూడి, బారువ, మందస రైలు నిలయ పరిధిలో ప్రయాణికుల అవసరాలపై 'న్యూస్‌టుడే' కథనం.

ఆపాలని కోరుతున్నవి..

ఇచ్ఛాపురంలో హావ్‌డా-యశ్వంత్‌పూర్, విశాఖపట్నం - అమృత్‌సర్ హిరాకుడ్ సూపర్‌ఫాస్ట్, పూరీ-చెన్నై, విశాఖపట్నం-షాలీమార్, పూరీ-గాంధీదామ్ వారపు రైళ్లు, పూరీ-అహ్మదాబాద్ (ఇది రైల్వే బోర్డు పరిశీలనలో ఉంది) ● జాడుపూడి, బారువ రైలు నిలయాల్లో బ్రహ్మపుర-విశాఖపట్నం పాసింజర్ స్పెషల్, ఇంటర్‌సిటీ, పూరీ-గుణుపూర్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు ● మందసలో భువనేశ్వర్-సికింద్రాబాద్ విశాఖ ఎక్స్‌ప్రెస్, సోంపేట ఆర్ఎస్‌లో ఫలక్‌నుమా, వివిధ వారపు రైళ్లు.


నిలువ నీడకు నోచుకోని ప్రాంతం


రైలు నిలయం పశ్చిమ ద్వారంగా రూపుదిద్దుకోవలసిన ప్లాట్‌ఫాం

గేటు స్థానంలో ఆర్‌వోబీ

ఉత్తర క్యాబిన్ వద్ద రైల్వే గేటు కారణంగా నిత్యం ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్నాయి. పట్టణాన్ని, గ్రామీణ ప్రాంతాలను కలిపేలా కొళిగాం రోడ్డులో రోడ్డు ఓవర్ బ్రిడ్జి (ఆర్‌వోబీ) నిర్మాణానికి ఎప్పటి నుంచో డిమాండ్ ఉంది. ఇందుకు అవసరమైన కార్యాచరణ నత్తనడకన సాగుతోంది. పలాస సీనియర్ సెక్షన్ ఇంజినీరు వద్ద పరిశీలనలో ఉన్న దస్త్రం కదిలేలా కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు కృషి చేయాలి. ● సమతా ఎక్స్‌ప్రెస్ విశాఖపట్నం నుంచి విజయనగరం మీదుగా హజరత్ నిజాముద్దీన్‌కు వారానికి ఐదు రోజులు నడుపుతున్నారు. మిగిలిన రెండు రోజులూ విజయనగరం మీదుగా హజరత్ నిజాముద్దీన్‌కు బ్రహ్మపుర నుంచి కొత్త రైలును నడిపితే ఉత్తరాంధ్ర, దక్షిణ ఒడిశా ప్రజలకు ఎంతో ఉపయోకరం. విశాఖ ఎక్స్‌ప్రెస్‌ను సికింద్రాబాద్ నుంచి లింగంపల్లికి పొడిగిస్తే వలస కార్మికులకు ఉపయోగపడుతుంది.

పశ్చిమ ద్వారం అవసరం

ఇచ్ఛాపురం రైలు నిలయ అభివృద్ధికి రత్తకన్న వైపు రెండో ప్రధాన ద్వారం ఏర్పాటు చేయడం అవసరం. ఈ సౌకర్యం కోసం సర్వేలు చేసి స్థలాన్ని గుర్తించారు. ప్రస్తుతం మూడు ప్లాట్‌ఫారాలు ఉన్నాయి. నాలుగో ప్లాట్‌ఫాం సహా పశ్చిమ ముఖద్వారం ఏర్పాటు చేయాలి. ప్రస్తుతం అమృత్ భారత్‌లో ప్రతిపాదించిన ప్రకారం కాలినడక వంతెన తూర్పు, పశ్చిమ ప్రాంతాలను అనుసంధానం చేస్తూ, రైలు నిలయంలో ప్లాట్‌ఫాంలు మారేలా తీర్చిదిద్దాలి. పశ్చిమ ప్రాంతం వైపు ఆంధ్రా, ఒడిశా గ్రామాల వారికి సౌకర్యం కల్పించినట్లవుతుంది.

కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లా..

ఉత్తరాంధ్ర పరిధిలో రైలు ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యలను కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడికి లేఖ ద్వారా నివేదించాం. ఇచ్ఛాపురం, జాడుపూడి, మందస, బారువ రైలు నిలయాల్లో రైళ్లకు హాల్టులు, ఇచ్ఛాపురం రైలు నిలయ అభివృద్ధి పనులను ప్రస్తావించాం. ఇచ్ఛాపురం నుంచి విజయనగరం పరిధిలో ప్రయాణికులు విజయవాడ, గుంటూరు వెళ్లడానికి ఇబ్బంది పడుతున్నారు. ఈ సమస్య పరిష్కారానికి భువనేశ్వర్ లేదా బ్రహ్మపుర నుంచి రాత్రి వేళ నడిచేలా కొత్త రైలును ప్రారంభిస్తే మేలు. ఖుర్దా డివిజన్ సమావేశంలో ఈ అంశాలను కేంద్ర మంత్రి ప్రస్తావిస్తారని ఆశిస్తున్నాం.

– కె.సూర్యప్రకాశరావు, జడ్ఆర్‌యూసీసీ సభ్యుడు, ఇచ్ఛాపురం

బడ్జెట్ తయారీలో భాగస్వాములు కావాలి: డీఎల్‌పీవో


గ్రామసభలో మాట్లాడుతున్న డీఎల్‌పీవో నాగభూషణరావు


ఉల్లిభద్రలో గ్రామసభ నిర్వహిస్తున్న ఎంపీడీవో

పార్వతీపురం గ్రామీణం, గరుగుబిల్లి, జియ్యమ్మవలస, న్యూస్‌టుడే: పంచాయతీల పరిధిలో వార్షిక బడ్జెట్ తయారీలో అందరూ భాగస్వాములు కావాలని డివిజనల్ పంచాయతీ అధికారి నాగభూషణరావు కోరారు. బుధవారం మండలంలోని నర్సిపురంలో నిర్వహించిన ఉపాధి హామీ గ్రామసభలో 2025-26 వార్షిక బడ్జెట్ సదస్సులో పాల్గొన్నారు. సర్పంచి బంగారమ్మ నేతృత్వంలో ఎంపీటీసీ సభ్యుడు తవిటినాయుడు, ప్రధాన పార్టీల నాయకులు, ప్రజలు సూచించిన అవసరాలను గుర్తించగా సచివాలయ కార్యదర్శులు జగన్మోహనరావు తీర్మానం రాశారు. ● గరుగుబిల్లి మండలంలో అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేయడానికి సన్నాహాలు ప్రారంభించామని ఎంపీడీవో జి.పైడితల్లి అన్నారు. తొలుత గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గరుగుబిల్లిలో ఉత్తమ వెలుగు సీఆర్‌పీ ఇజ్జరోతు గౌరీశ్వరికి గుర్తించి సర్పంచి కలిశెట్టి ఇందుమతి దుశ్శాలువాతో సన్మానించారు. ● జియ్యమ్మవలస మండలంలో ఉపాధి హామీ ఆధ్వర్యంలో బుధవారం పెదమేరంగి, చినమేరంగి, తాళ్లడుమ్మ, అల్లువాడ, అంకవరం, బీజేపురం, అర్నాడ, చింతల బెలగాం తదితర గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించారు. 2024-25లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను చర్చించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక


విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

పాచిపెంట, న్యూస్‌టుడే: పాచిపెంట జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపికయ్యారు. ఆగస్టు 25న విజయనగరంలో జరిగిన అథ్లెటిక్స్ సౌత్‌జోన్‌లో వి.విద్యాసాగర్, కె.జోత్స్న, పి.ఇందు, ఏ.కావ్య ఉత్తమ ప్రతిభ కనబర్చారు. ఈనెల 4న రాజమండ్రిలో నిర్వహించనున్న పోటీల్లో ఆడనున్న విద్యార్థులను హెచ్‌ఎం ఈశ్వరావు, పీడీ చిన్నారావు, ఉపాధ్యాయులు అభినందించారు.

పెదమానాపురం టు కేరళ

పశువుల అక్రమ రవాణా ఉమ్మడి జిల్లాలో యథేచ్ఛగా సాగుతోంది.. ఒడిశా రాష్ట్రం నుంచి కేరళకు వయా మానాపురం మీదుగా జరుగుతోంది.. రాష్ట్రాల సరిహద్దులు దాటి, విదేశాలకు తరలింపు చేస్తున్నారు. మార్గమధ్యలో అనధికార జంతు కబేళాలకు కొన్నింటిని చేరుస్తున్నారు. ధనదాహంతో వేలాది గోవులు, గేదెలను ముష్కరులు బలిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా వాహనాల్లో పరిమితికి మించి పశువులను కుక్కి తీసుకుపోతున్నా.. నిత్యం ఈ దందా సాగుతున్నా.. మూగజీవుల వేదన ఎవరికీ పట్టడం లేదు. ఏటా రూ.కోట్లలో జరిగే ఈ వ్యాపారంపై 'ఈనాడు' పరిశీలనాత్మక కథనం.

ఉమ్మడి జిల్లాలో యథేచ్ఛగా పశువుల రవాణా

యంత్రాంగానికి పట్టని మూగవేదన


రూ.కోట్లలో చీకటి వ్యాపారం

ఈనాడు, పార్వతీపురం మన్యం

పెదమానాపురం.. ఇక్కడి సంత ఉమ్మడి జిల్లాలోనే కాదు.. ఇటు ఉత్తరాంధ్ర, అటు ఒడిశాలోనూ ప్రత్యేక గుర్తింపు పొందింది. ప్రతి శనివారం జరిగే సంతలో వేలల్లో పశువుల అమ్మకాలు, కొనుగోళ్లతో భారీ వ్యాపారం జరుగుతోంది. ఒడిశాలోని అప్సర, కొరాపుట్ తదితర సంతల్లో దళారులు పశువులను కొనుగోలు చేస్తారు. అక్కడి నుంచి వాటిని నడిపించుకుంటూ శుక్రవారం మానాపురం తీసుకొస్తారు. పార్వతీపురం, అలమండ, అచ్యుతాపురంలో జరిగే వారపు సంతల్లో కొన్నవాటినీ ఇక్కడికే చేరుస్తారు. వ్యాపారులకు ఒక్కోటి రూ.10 వేల నుంచి రూ.70 వేల వరకు విక్రయిస్తుంటారు. ఆరోగ్యంగా ఉంటే మరింత ధర పలుకుతుంది. వాటిని వాహనాల్లో తరలించేందుకు రవాణా ముఠా సిద్ధంగా ఉంటుంది.

రెండువిధాలా రవాణా..


ప్రతి వారం జిల్లా నుంచి 8 వేల వరకు గోవులను రవాణా చేస్తుంటారు. శనివారం ఉదయం కొనుగోలు జరిగిన తర్వాత రాత్రి వేళల్లో వాహనాల్లోకి ఎక్కించి రవాణా చేస్తారు. విశాఖపట్నం, కాకినాడ, గొల్లప్రోలు, కత్తిపూడి, రాజమహేంద్రవరం, నూజివీడు తదితర ప్రాంతాలకు కాస్త నాసిరకం పశువులు, బాగున్నవి చెన్నై, హైదరాబాద్, కేరళ రాష్ట్రాలకు తరలిస్తారు. గమ్యస్థానానికి చేర్చితే ఒక ధర, దారిలో పోలీసులు పట్టుకున్నా సంబంధం లేకుంటే మరోలా రవాణా ఛార్జీలు వసూలు చేస్తుంటారు.



రవాణాకు వాహనంలోకి ఎక్కించిన పశువులు

ప్రత్యేక వాహనాల్లో..

రాజమహేంద్రవరం, జామి ప్రాంతాలకు చెందిన కొందరు వీటి రవాణాలో ఆరితేరిపోయారు. లారీ లాంటి ప్రత్యేక వాహనాల్లో రెండంతస్తుల్లా ఏర్పాటు చేసుకున్నారు. అందులో పశువులు నిలబడేలా కాకుండా వాటి కాళ్లు కొట్టి కట్టేస్తారు. సాధారణంగా 15-20 పట్టే వాహనంలో 60-70 వరకు కుక్కేస్తారు. వీటిని అక్కడకు చేర్చేందుకు సుమారు రూ.3 లక్షలు వసూలు చేస్తారని సమాచారం. కేరళ రాష్ట్ర సరిహద్దు దాటితే గమ్యస్థానానికి చేరినట్లేనని భావిస్తారు. అక్కడ వీటి రవాణాపై ఆంక్షలు లేవు.



ఇక్కడ రూ.250.. విదేశాల్లో రూ.6 వేలు..

దేశంలో కిలో రూ.250 నుంచి రూ.400 వరకు విక్రయించే పశుమాంసాన్ని అరబ్ దేశాల్లో రూ.6 వేలుకు విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. కేరళలో దీన్ని వేర్వేరుగా ప్యాక్ చేసి సముద్ర మార్గంలో విదేశాలకు తరలిస్తున్నారు. విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో ప్రతివారం రూ.5 కోట్ల లెక్కన ఏటా సుమారు రూ.260 కోట్ల వరకు అక్రమ వ్యాపారం జరుగుతున్నట్లు సమాచారం.

చెక్‌పోస్టుల్లో అడ్డుకుంటాం..



ఒడిశా నుంచి జిల్లాకు పశువుల అక్రమ రవాణాను చెక్‌పోస్టుల్లో అడ్డుకుంటాం. పాచిపెంట నుంచి జిల్లా సరిహద్దుల వెంబడి నిఘా తీవ్రతరం చేశాం. మూగజీవాలను హింసించి వాహనాల్లో కుక్కేసి తరలించడం నేరం. అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని నేర సమీక్షలో ఆదేశించాం. అనుమతి లేకుండా పశువులను వధించి, మాంసం విక్రయించడమూ నేరమే. గాలి, వెలుతురు తగిలే వాహనాల్లోకి ఎక్కించాలి. వాటికి దాణా వేసి, నీరందించాలి. వారపు సంతలు జరిగే రోజుల్లో ప్రత్యేక నిఘా పెడతాం.

– ఎస్వీ మాధవరెడ్డి, ఎస్పీ, పార్వతీపురం మన్యం